# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 160 | పేజీలు : 08 | గురువారం | 18-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## బాంబులేస్తాం

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

- 'ఒప్పందం నచ్చకపోతే మళ్లీ బాంబులేస్తాం'..
- అమెరికా-ఇరాన్ ఒప్పందంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదన్న అమెరికా అధ్యక్షుడు
- ఇరాన్ ప్రవర్తనపై కూడా ఘాటు వ్యాఖ్యలు
- ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు సందర్భంగా వ్యాఖ్యలు
- ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా చర్చ



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

అమెరికా–ఇరాన్ మధ్య నెలల తరబడి కొనసాగిన ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం కుదిరే దశలో ఉన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒప్పంద ముసాయిదా తనకు నచ్చకపోతే

## జీఓ విడుదల



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్ట్ బోర్డును తెలంగాణ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈహెచ్ఎస్ అమలుకు కొత్త బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఏర్పాటు చేస్తూ జీఓ నంబర్–40 విడుదల చేసింది.

## విద్యతోనే జీవితాల్లో మార్పు

- ప్రభుత్వ పాఠశాలలను చిన్నచూపు చూడొద్దు: రేవంత్ రెడ్డి
- ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం
- విద్యారంగానికి రూ.27 వేల కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడి
- త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ కులవివక్ష నిర్మూలన లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామన్న సీఎం



2

హైదరాబాద్ పల్స్,రంగారెడ్డి

తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం అద్దాల మేడల్లో కాదని.. తరగతి గదుల్లోనే ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థులపై పెట్టేది ఖర్చు కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం పెట్టే పెట్టుబడని తెలిపారు. విద్య ఒక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కూడా భవిష్యత్తులో ప్రధాని, ముఖ్యమంత్రి, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ప్రజాప్రతినిధులు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడాన్ని ఎవరూ చిన్నతనంగా భావించవద్దని సూచించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను బుధవారం ప్రారంభించిన సీఎం అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పాఠశాల రాష్ట్రం మొత్తానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 27 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రపంచస్థాయి విద్యా సంస్థల వరకు పరిశీలించి విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి సమగ్ర నివేదిక అందించారని చెప్పారు.

## గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

## ఎక్కడ చూసినా కూల్చివేతలే



2

హైదరాబాద్ పల్స్,ఖమ్మం

ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో ౹ా×=పై కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్

## క్షమాపణ చెప్పాలి కోటి కట్టాలి

స్టాలిన్‌కు టీవీకే నేత లీగల్ నోటీసు

- మాజీ సీఎం స్టాలిన్‌కు టీవీకే నేత ఆదవ్ అర్జున లీగల్ నోటీసు
- డ్రగ్స్ కేసుతో తనకు సంబంధాలు అంటగట్టారని ఆరోపణ
- 48 గంటల్లో క్షమాపణ చెప్పి, రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- తమిళనాట డీఎంకే, టీవీకే మధ్య ముదురుతున్న రాజకీయ వివాదం



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు రాజకీయాల్లో మరో తీవ్ర వివాదం రాజుకుంది. డ్రగ్స్ స్మగ్లింగ్ కేసుతో తనకు సంబంధం ఉందంటూ నిరాధార ఆరోపణలు చేశారంటూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత

## క్షేత్రస్థాయిలో చూపించాలి



- పోలవరం ముంపుపై కేంద్రం కీలక లేఖ.. కాగితాలపై కాదు క్షేత్రస్థాయిలో చూపించాలన్న హరీశ్ రావు
- తెలంగాణ పరిధిలో ముంపు ప్రాంతాలను ఆదుకుంటామన్న పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ
- పీపీఏ రక్షణ హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్న హరీశ్ రావు

2

## ప్రోత్సాహం కల్పిస్తాం

తెలంగాణలో మేలుజాతి వంగడాల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తాం: భట్టి విక్రమార్క



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క




2

## ఆమె గొంతు నొక్కలేరు

అనితకు మద్దతుగా నారా లోకేశ్

- మేకప్ మంత్రి అంటూ అనితపై గుడివాడ అమర్ నాథ్ అనుచిత వ్యాఖ్యలు
- అనితను టార్గెట్ చేయడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగుందని మండిపాటు
- అనిత సాధించిన విజయాలను తగ్గించలేరని వ్యాఖ్య

## క్షమాపణ చెప్పాలి



2

- గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి: వంగలపూడి అనిత
- అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గుడివాడ అమర్‌నాథ్
- మీ ఇళ్లలో కూడా మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్న అనిత
- మహిళలను కించపరిచే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

## మావోయిస్టులకు... మరో గట్టి ఎదురుదెబ్బ

'మోస్ట్ వాంటెడ్' మహిళా నేత శకుంతల సరెండర్

- రెండు దశాబ్దాలుగా కీలకంగా వ్యవహరించిన శకుంతల అలియాస్ పుష్ప
- కోల్‌కతా పోలీసుల ముందు తుపాకీ, తూటాలతో లొంగిపోయిన శకుంతల
- తుపాకి పట్టుకోవడం కంటే ప్రశాంతంగా జీవించడం మంచిదని వ్యాఖ్య

2



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఆపరేషన్ కగార్ ప్రభావంతో మావోయిస్టు పార్టీలో సరెండర్ల పర్వం కొనసాగుతోంది. తాజాగా, రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ బలగాలకు తలనొప్పిగా మారిన మహిళా మావోయిస్టు నేత శకుంతల అలియాస్ పుష్ప లొంగిపోయారు. ఒక తుపాకీ, 40 రౌండ్ల తూటాలతో కోల్‌కతా పోలీసుల ముందు ఆమె సరెండర్ అయ్యారు. ఆమెపై ప్రభుత్వం రూ. 10 లక్షల రివార్డు ప్రకటించిన సంగతి గమనార్హం. ఈ

## సీఎం కి థ్యాంక్స్

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- హనుమకొండ పర్యటనకు సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- తెలంగాణ పోలీసు శాఖకు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన పవన్
- తెలంగాణ ప్రజలు చూపిస్తున్న ప్రేమను జీవితాంతం గుర్తుంచుకుంటానని ట్వీట్
- నిరంజన్ ధైర్యం, ఆత్మవిశ్వాసం స్ఫూర్తిదాయకమని ప్రశంసలు

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమానిని పరామర్శించేందుకు ఆయన ఈరోజు వరంగల్ జిల్లా హనుమకొండకు వెళ్లారు. పర్యటన ముగిసిన అనంతరం, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్

# బాంబులేస్తాం

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే సున్నితంగా ఉన్న పశ్చిమాసియా పరిస్థితులపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసితో కలిసి మీడియాతో మాట్లాడిన ట్రంప్.. అమెరికా–ఇరాన్ మధ్య కుదరబోయే ఒప్పందం ఇంకా తుది రూపం దాల్చలేదని చెప్పారు. ప్రస్తుతం అది కేవలం అవగాహన ఒప్పందం మాత్రమేనని పేర్కొన్నారు. "ఆ ఒప్పందం నాకు నచ్చకపోతే మళ్లీ వారిపై కాల్పులు జరుపుతాం. వారి తలలపై బాంబులు వేయడం మొదలుపెడతాం" అంటూ ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రవర్తన సరిగా లేకపోయినా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలు మళ్లీ అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించాయి

# సీఎం కి థ్యాంక్స్

మొదటి పేజీ తరువాయి

మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ చేశారు.

**నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చిన పవన్**

కొన్ని రోజుల క్రితం హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు, తాను ఓ అరుదైన వ్యాధితో పోరాడుతున్నానని, తన అభిమాన నటుడు పవన్ కల్యాణ్‌ను కలవడమే తన కోరిక అని పేర్కొంటూ ఓ వీడియో విడుదల చేశాడు. ఆ వీడియో పవన్ దృష్టికి చేరింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన, అభిమాని ఆకాంక్షను నెరవేర్చాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు నేరుగా హనుమకొండలోని నిరంజన్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ నిరంజన్ ప్రదర్శిస్తున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం తనను ఎంతగానో కదిలించిందని పవన్ పేర్కొన్నారు. "అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో నిరంజన్ అసాధారణ ధైర్యం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు ఎంతో స్ఫూర్తిదాయకం. అతని మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను" అని పవన్ తన పోస్టులో వివరించారు.

**తెలంగాణ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు**

ఈ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, తనకు పూర్తి సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి అభిమానం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని, వారి మమకారాన్ని జీవితాంతం తన హృదయంలో నిలుపుకొంటానని పవన్ భావోద్వేగంగా రాశారు. చివరగా "ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో చూడాలని కోరుకుంటున్నాను" అంటూ అభిమానికి భరోసా ఇచ్చారు.

# మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా కోల్‌కతా పోలీస్ కమిషనర్ అజయ్ నంద్ మాట్లాడుతూ, శకుంతల 2001లో చిన్న వయసులోనే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితురాలై సంస్థలో చేరినట్లు తెలిపారు. తొలుత సాంస్కృతిక విభాగంలో విప్లవ గీతాలు, ప్రచార కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీలతో చురుగ్గా పని చేశారు. తర్వాత పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ లో కీలక నేతగా ఎదిగారు. దల్మా జోన్ జోనల్ కమిటీ సభ్యురాలిగా బీహార్–జార్ఖండ్–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో అనేక హింసాత్మక ఘటనల్లో ఆమె పాత్ర ఉన్నట్లు వెల్లడించారు. సరెండర్ అనంతరం మీడియాతో మాట్లాడిన శకుంతల, "హింస వల్ల భవిష్యత్ లేదు" అంటూ అడవుల్లో ఇప్పటికీ సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్న మావోయిస్టులకు సందేశం ఇచ్చారు. "తుపాకీ పట్టుకోవడం కంటే ప్రశాంతంగా జీవించడం మంచిది. హింసతో ఎలాంటి భవిష్యత్తు లేదు. అందరూ త్వరగా ఆయుధాలు వదిలి సమాజంలోకి వచ్చి కొత్త జీవితం ప్రారంభించాలి" అని పిలుపునిచ్చారు. శకుంతల సరెండర్‌తో జంగల్‌మహల్ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టు నెట్‌వర్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆమెను చూసి మిగిలిన క్యాడర్లు కూడా లొంగిపోయే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జీఓ విడుదల

మొదటి పేజీ తరువాయి

చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు కొనసాగనుంది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల ప్రతినిధులకు బోర్డులో ప్రభుత్వం స్థానం కల్పించింది. ఉద్యోగులకు హెల్త్ కార్డుల జారీ విధానంపై మార్గదర్శకాలని ఈ బోర్డు రూపొందించనుంది. త్వరలో సమావేశమై ఈహెచ్‌ఎస్ అమలు మార్గదర్శకాలను ట్రస్ట్ బోర్డు ఖరారు చేయనుంది. ఆరోగ్య, ఆర్థిక, విద్య, హోం తదితర శాఖల ఉన్నతాధికారులు సభ్యులుగా నియమించింది. టీఎన్‌జీఓ, టీజీఓ, పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్ సహా ఉద్యోగ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించింది. పెన్షనర్ల సంఘాల ప్రతినిధులకు కూడా ట్రస్ట్ బోర్డులో చోటు దక్కింది.

# ఆమె గొంతు నొక్కలేరు

మొదటి పేజీ తరువాయి

హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్ నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యల దుమారం ఏపీ రాజకీయాల్లో మరింత ముదిరింది. ఈ వ్యవహారంపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు యాదృచ్ఛికంగా చేసినవి కావని, వైసీపీ ఐదేళ్ల విఫల పాలనలో పెంచి పోషించిన విషపూరిత రాజకీయ సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు, అభివృద్ధిపై మాట్లాడటానికి ఆ పార్టీ నేతల వద్ద ఎలాంటి సమాధానాలు లేవని లోకేశ్ ఎద్దేవా చేశారు. హోంమంత్రి పదవిలో ఉన్న ఒక మహిళను, అందులోనూ ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకురాలిని పనిగట్టుకుని లక్ష్యంగా చేసుకోవడం వెనుక వైసీపీ వికృత రాజకీయం దాగి ఉందన్నారు. వంగలపూడి అనిత కష్టపడే తత్వానికి, ధైర్యానికి, నిరంతర ప్రజాసేవకు నిదర్శనమని లోకేశ్ కొనియాడారు. వైసీపీ నాయకులు ఎంతగా దూషించినా, బాడీ షేమింగ్ చేసినా ఆమె సాధించిన విజయాలను అస్సలు తగ్గించలేరని, ఆమె గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ఏపీ ప్రజలు ఇలాంటి ద్వేషపూరిత రాజకీయాలను ఎప్పుడో తిరస్కరించారని గుర్తుచేశారు. హోంమంత్రి అనితతో పాటు రాష్ట్రంలోని ప్రతి మహిళకు, ప్రతి దళితుడికి వైసీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# క్షమాపణ చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దావానలంలా మండుతున్నాయి. కూటమి ప్రభుత్వ నేతలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలు, తెలుగు మహిళా విభాగాలు అమర్‌నాథ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. అనిత సైతం దీనిపై స్పందిస్తూ... రాజకీయ ముసుగు వేసుకుని మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే వారిపై తాను కచ్చితంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇలా మాట్లాడే ముందు తమ ఇళ్లలో కూడా మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని హితవు పలికారు. గుడివాడ అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఇష్యూపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవి కేవలం ఒక హోంమంత్రిని అన్న మాటలు కావని.. యావత్ మహిళా జాతిని, వారి ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ... ఒక దళిత మహిళ ఉన్నత పదవిలో ఉంటే ఓర్వలేక ఇలా కట్టు, బొట్టును టార్గెట్ చేస్తూ మాట్లాడటం.. వైసీపీ చేస్తున్న విషపూరిత, వికృత రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో వైసీపీ నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# క్షమాపణ చెప్పాలి, కోటి కట్టాలి

మొదటి పేజీ తరువాయి

ఆదవ్ అర్జున.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు, డీఎంకే ఐటీ వింగ్‌కు లీగల్ నోటీసు పంపారు. 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అరెస్ట్ చేసిన జాన్ బ్రిట్టో అనే వ్యక్తితో తనకు సంబంధాలు అంటగడుతూ డీఎంకే, దాని అనుబంధ విభాగాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని ఆదవ్ అర్జున తన నోటీసులో ఆరోపించారు. ఈ నిరాధారమైన, కల్పితమైన ఆరోపణల వల్ల తన ప్రతిష్ఠకు తీవ్ర భంగం వాటిల్లిందని, తాను మానసిక వేదనకు గురయ్యానని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే తనను నేర కార్యకలాపాలతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డీఎంకే ఐటీ వింగ్‌తో పాటు ఎంకే స్టాలిన్ కూడా తనకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదవ్ అర్జున డిమాండ్ చేశారు. నోటీసు అందుకున్న 48 గంటల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని గడువు విధించారు. క్షమాపణతో పాటు తన పరువుకు కలిగించిన నష్టానికి, మానసిక క్షోభకు గాను రూ. 1 కోటి పరిహారంగా చెల్లించాలని కూడా నోటీసులో కోరారు. తాను నిర్దేశించిన గడువులోగా క్షమాపణ చెప్పి, పరిహారం చెల్లించడంలో విఫలమైతే.. స్టాలిన్‌తో పాటు ఈ ఆరోపణల వ్యాప్తికి కారణమైన ప్రతి ఒక్కరిపైనా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని ఆదవ్ అర్జున స్పష్టం చేశారు. ఈ లీగల్ నోటీసుతో తమిళనాట డీఎంకే, నూతనంగా ఏర్పాటైన టీవీకే మధ్య రాజకీయ ఘర్షణ మరింత ముదిరినట్టయింది. ఈ వివాదం రాబోయే రోజుల్లో న్యాయపోరాటానికి దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ప్రోత్సాహం కల్పిస్తాం

మొదటి పేజీ తరువాయి

అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.

ఆ పంటలకు ప్రాధాన్యం ఇస్తాం..

నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. BPT 5204, తెలంగాణ సోనామసూరి, KNM-1638, జై శ్రీరామ్, HMT రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.

# క్షేత్రస్థాయిలో చూపించాలి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ సరిహద్దు గ్రామాలను భయపెడుతున్న పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ (వెనక్కి తన్నే నీరు) ముంపు సమస్యపై ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సమర్పించిన వినతిపత్రంపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ' సానుకూలంగా స్పందిస్తూ రాతపూర్వక హామీ ఇచ్చింది. ఈ లేఖకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం కారణంగా తెలంగాణ పరిధిలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను రెండు విధాలుగా ఆదుకుంటామని అథారిటీ స్పష్టం చేసింది. ఒకటి.. తగిన ఇంజనీరింగ్ పనుల ద్వారా ఆయా గ్రామాలకు ముంపు ముప్పు లేకుండా రక్షించడం. రెండు.. అది సాధ్యం కాకపోతే పునరావాస–పునర్నిర్మాణ చట్టం కింద ఆ భూములను సేకరించి రైతులకు పక్కా నష్టపరిహారం అందించడం. 2025 ఏప్రిల్ 8న జరిగిన అంతర్రాష్ట్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామని పీపీఏ తెలిపింది. గోదావరి బేసిన్ పరిధిలోని తెలంగాణ ప్రజల జీవనోపాధిని, గిరిజనుల వ్యవసాయ భూములను కాపాడటానికి శాస్త్రీయ అంచనాలు, సమగ్ర వరద నివారణ చర్యలు తీసుకుంటామని లేఖలో పునరుద్ఘాటించింది. తెలంగాణ ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో... కేంద్ర ప్రభుత్వం ముంపు ఆందోళనలను అధికారికంగా గుర్తించి, రక్షణకు హామీ ఇవ్వడాన్ని తాము స్వాగతిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. అయితే, ఈ హామీలు కేవలం ఆఫీసు ఫైళ్లకే పరిమితం కాకుండా గ్రౌండ్ లెవెల్‌లో సకాలంలో అమలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రజల భద్రత, రైతుల ఉపాధి విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం, పీపీఏ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు కలిసి సమన్వయంతో వ్యవహరించి, ప్రభావితమయ్యే ప్రతి కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

# విద్యతోనే జీవితాల్లో మార్పు..

మొదటి పేజీ తరువాయి

దాని ఆధారంగానే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ల ఆలోచనకు రూపం ఇచ్చామని వివరించారు. నాణ్యమైన విద్య అందరికీ చేరాలన్న లక్ష్యంతో ఆరుట్ల గ్రామాన్ని ఎంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం భారీ స్పందన రావడం సంతోషకరమని సీఎం పేర్కొన్నారు. 'నో అడ్మిషన్స్' బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు. పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. నిజాం పాలన, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి మహనీయుల స్ఫూర్తి ఉన్న నేలపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తి ఇక్కడి విద్యార్థుల్లోనూ కనిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తన సొంత నియోజకవర్గంలో ఈ పాఠశాలను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ, ఆరుట్లను ఎంచుకోవడం వెనుక ఇదే కారణమని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం పేర్కొన్నారు. కేవలం చదువు మాత్రమే సరిపోదని, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెరగాలని అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. అక్కడ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వెల్లడించారు. క్రీడల రంగంలోనూ తెలంగాణ మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆరుట్ల విద్యార్థులు ఫుట్‌బాల్ అద్భుతంగా ఆడారని ప్రశంసించారు. క్రీడల్లో వెనుకబాటుతనాన్ని అధిగమించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువచ్చి యువ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలని ప్రయత్నించినట్లు తెలిపారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. సమాజంలో కులవివక్షను తగ్గించే దిశగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని సంకల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ వసతులు, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తరగతి గదులు, వసతి సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

# గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీం1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# ఎక్కడ చూసినా కూల్చివేతలే

మొదటి పేజీ తరువాయి

ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు.. కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. ూ×= అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు ూ×= జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. ూ×=ను పట్టించుకోకపోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల(జులై) 25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు తాతా మధు, పువ్వాడ అజయ్, కందాల ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా పుస్తకాలు అమ్ముకుంటున్న ప్రైవేట్ స్కూల్లు....

**ప్రైవేట్ స్కూల్ల దోపిడీని అరికట్టాలి.....**

**మామిడాల ప్రవీణ్, ఆర్.ఉదయ్, యాదాద్రి జిల్లా అధ్యక్షకార్యదర్శులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరులో ప్రైవేట్ స్కూల్లో దోపిడి రోజు రోజుకూ పెరిగిపోతుందని తల్లిదండ్రుల కష్టాన్ని స్వాహా చేస్తున్నారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి.డి.ఎస్.యూ యాదాద్రి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం ప్రవీణ్, ఆర్ ఉదయ్ లు అన్నారు. విద్యా సంవత్సరం మొదలైన సందర్భంగా ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్, ఉదయ్ లు మాట్లాడుతూ ఆలేరులో ఉన్న ప్రైవేట్ స్కూలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలు అమ్ముతూ తల్లిదండ్రులని ఇక్కడే కొనాలని ఇబ్బంది పెట్టి వారి సంపాదనను స్వాహా చేస్తున్నారనీ, స్కూల్ యాజమాన్యాలకు పుస్తకాలు అమ్మే హక్కు లేదని, కానీ దాన్ని పట్టిచుకోకుండా విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని, ఒక వైపు ప్రభుత్వ బడులను మూసివేస్తూ ప్రయివేటు బడులను ప్రోత్సాహిస్తున్నారని, విద్యను వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులపై, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రైవేటు పాఠశాలలు తమ యాజమాన్యాలు సూచించిన దుకాణాల్లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని, మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను అధిక ధరలకు విక్రయించి తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని విమర్శించారు. అలాగే ట్యూషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు, రవాణా ఫీజుల పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. ఉచిత విద్య హక్కు అయినప్పటికీ దానిని లాభదాయక వ్యాపారంగా మార్చడం దుర్మార్గమని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించి, అక్రమ ఫీజుల వసూళ్లు, పుస్తకాల విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పి.డి.ఎస్.యూ.ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా నాయకులు మావిడాల మహేష్, కళ్ళెపు ప్రణయ్, బన్నీ, విశాల్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భూమిని ప్రైవేటు పరం చేసిందే బీఆర్ఎస్ పార్టీనే

**కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, జూన్ 17,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం బుధవారం బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన బోర్డు కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నవ కంటోన్మెంట్ నిర్మాణం కోసం పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సి ఇ ఓ అరవింద్ కుమార్ ద్వివేది,ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

**బీఆర్ఎస్ అవినీతి బట్టబయలు**

కంటోన్మెంట్‌లోని విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిందే గత బీఆర్ఎస్ నాయకులని ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆరోపణలు చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల కోసం వినతి**

2025 జూలైలో సర్వే నెం.157/1 లోని 8 ఎకరాల భూమిలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తానే వినతి పత్రం అందజేశానని తెలిపారు.

**50 కోట్ల లంచం – కేటీఆర్ పాత్ర**

2023 జూన్‌లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడి,స్వయంగా కేటీఆర్ 50 కోట్లు లంచం తీసుకుని ఆ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని కంటోన్మెంట్ ప్రాంతం లోని ప్రతి ఒక్కరికీ తెలుసని ఆరోపించారు.2023 జూన్ లోనే ఇచ్చిన సి.సి.ఎల్ ఏ కాపీని ఎమ్మెల్యే ఈరోజు సాక్ష్యాలతో సహా బహిర్గతం చేశారు.



**ఎమ్మెల్యే ఫిర్యాదుతో కంటోన్మెంట్ బోర్డు లో అనుమతుల నిరాకరణ**

ఆ భూములలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడానికి తాను ప్రయత్నం చేస్తున్నానని, ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని కంటోన్మెంట్ బోర్డు అధికారులకు తాను ఫిర్యాదు చేశానని,ఆ ఫిర్యాదుతో బోర్డు అధికారులు అక్కడ ఎటువంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వలేదని చెప్పారు.

**కోర్టు తీర్పుపై పోరాటం**

అప్పటి బీఆర్ఎస్ పెద్దలకు లంచం ఇచ్చి సీసీఎల్ఏ ద్వారా పొందిన కాపీని బోర్డుకి చూపించి,బోర్డు అనుమతులు తీసుకోవాలని ప్రయత్నించిన ప్రైవేటు వ్యక్తులకు తన ఫిర్యాదుతో బోర్డు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించి సీసీఎల్ఏ కాపీని చూపించి తమకు అనుకూలంగా తీర్పును తెచ్చుకున్నారని, బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడకుండా ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని అన్నారు. ప్రజల పక్షాన తాను ఈ కేసులో ఇంప్లీడ్ అయి తీర్పును ఛాలెంజ్ చేస్తానని ప్రకటించారు.

**నింద మాపై వేయడం తగదు**

తప్పు చేసింది బీఆర్ఎస్ నాయకులైతే ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై వేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే మండిపడ్డారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

**303 కోట్లతో మాస్టర్ ప్లాన్**

ఎలివేటెడ్ కారిడార్ల ద్వారా కంటోన్మెంట్ బోర్డుకు సమకూరిన 303 కోట్లతో భవిష్యత్ తరాలకు ఇబ్బంది లేకుండా నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలను ఆధునీకరించాలని బోర్డు సమావేశంలో అధికారులకు సూచించారు.

**నిరుపయోగ టాయిలెట్ల స్థానంలో పార్కులు**

నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను కూల్చివేసి, వార్డు–7 వనిత ఎన్‌క్లేవ్ తరహాలో పార్కులు, మహిళా భవన్‌లు, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేస్తే పిల్లలు, యువత, పెద్దల ఆరోగ్యానికి, వాకింగ్‌కు ఎంతో ఉపయోగమని తెలిపారు.

**మడ్‌ఫోర్డ్ వాసులకు భరోసా**

మడ్‌ఫోర్డ్ ప్రాంతంలో గుడిసెలు తొలగిస్తారనే వదంతులతో భయపడుతున్న పేదలను స్వయంగా కలిసి ధైర్యం చెప్పారు. ఇది పూర్తిగా అపోహ మాత్రమేనని, ఎవరినీ ఖాళీ చేయనివ్వనని హామీ ఇచ్చారు. పేదవాడి గుడిసెకు ఎసరు వస్తే తాను ముందుండి అడ్డుకుంటానని, అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనని భరోసా ఇచ్చారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొహం చాటేస్తున్న రుతుపవనాలు..!

# 40శాతం తగ్గిన వర్షాలు- రీఎంట్రీ ఎప్పుడంటే ?

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17 :** దేశంలో నైరుతి రుతుపవనాల పురోగతి మందగించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, వర్షపాతంలో ఏకంగా 40 శాతం లోటు నమోదైంది. జూన్ 4 నుండి జూన్ 17 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా సాధారణంగా 65.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 39.7 మిమీ వర్షం మాత్రమే పడింది. ఇది దేశీయ రైతాంగానికి, ఖరీఫ్ సాగు పనులకు పెద్ద సవాలుగా మారింది.ఇన్సాట్–3డీఎస్ ఉపగ్రహం అందించిన తాజా చిత్రాలు మరింత కలవరపెడుతున్నాయి. దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల పైన ఆకాశంలో మేఘాల ప్రభావం అసలు లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక అంతర్గత ప్రాంతాలు పొడి వాతావరణంతో కనిపిస్తున్నాయి. సాధారణంగా ఈ సమయానికి దట్టంగా కమ్ముకోవాల్సిన మబ్బులు లేకపోవడంతో రుతుపవన శ్రేణి బలహీనపడినట్లు స్పష్టమవుతోంది. అధిక శాతం మేఘాలన్నీ కేవలం బంగాళాఖాతం, ఈశాన్య రాష్ట్రాలకే పరిమితమయ్యాయి.ఈ వర్షపాత లోటు పలు వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గుజరాత్‌లో అత్యధికంగా 98 శాతం వర్షపాత లోటు నమోదు కాగా, మహారాష్ట్రలో 79 శాతం ప్రతికూలత నమోదైంది. అలాగే జార్ఖండ్‌లో 66 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 65 శాతం, మేఘాలయలో 85 శాతం మేర వర్షాలు కురవలేదు. ఈ కేటగిరీలోనే తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, బీహార్, అస్సాం రాష్ట్రాలలో కూడా వానల కొరత స్పష్టంగా కనిపిస్తోంది.జూన్ నెల వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైన సమయం. వరి, పత్తి, సోయాబీన్, పప్పుధాన్యాల సాగు ఈ సమయంలోనే ఊపందుకుంటుంది. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో భూమిలో తేమ శాతాన్ని ఈ పొడి వాతావరణం దెబ్బతీస్తోంది. విత్తనాలు వేసే ప్రక్రియ నెమ్మదించింది. అరేబియా సముద్రం నుండి వీచే మారుతాలు బలహీనపడటం, వాతావరణ ఎగువ పొరల్లో గాలుల తీవ్రత కారణంగానే వర్షాలు కురవడం లేదని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. రుతుపవనాల పురోగతి దాదాపు ఒక వారంగా స్తంభించిపోవడానికి ఇదే ప్రధాన కారణం.అయితే, జూన్ 21 తర్వాత రుతుపవనాలలో కొంత చలనం వచ్చే అవకాశం ఉందని వాతావరణ అంచనా నమూనాలు సూచిస్తున్నాయి. అరేబియా సముద్రం నుండి తేమతో కూడిన గాలులు మళ్లీ పుంజుకుని, దేశవ్యాప్తంగా వర్షాలు కురిసేందుకు పరిస్థితులు అనుకూలించవచ్చు. ఒకవేళ జూన్ చివరి నాటికి కూడా ఈ లోటు భర్తీ కాకపోతే, దేశీయ వ్యవసాయ రంగానికి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో పాటు ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడే ప్రమాదం ఉంది.



# గుడిసెలను పరిశీలించిన హౌసింగ్ పీడీ...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం నమిల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల కోసం గుడిసెలను హౌజింగ్ పీడీ లక్క ఆలువేలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి రాజు ఉప సర్పంచ్ మార్క శివకుమార్, మాయకోటి రాజు, బొమ్మగాని శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీలేవేరు బాలరాజు గౌడ్, హౌసింగ్ ఏఈ వేముల వివేక్, జెమిల్ పంచాయితీకార్యదర్శి పాల్గొన్నారు.

# పెండింగ్ డి.ఏ. లను వెంటనే విడుదల చేయాలి...

**టీ.ఎస్.యు.టి.ఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మధుసూదన్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో టీ.ఎస్.యు.టి.ఎఫ్ మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల శాఖ అధ్యక్షులు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మహేందర్ లు మాట్లాడుతూ... ప్రభుత్వం పి.ఆర్.సి నివేదికను తెప్పించుకొని వెంటనే మెరుగైన పిట్మెంట్ తో అమలు చేయాలన్నారు. పెండింగ్ డి.ఏ లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విదంగా వెంటనే ఓ.పి.ఎస్ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. లేని పక్షంలో జులై నెలలో ప్రత్యక్ష పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాద్యులు జె.కరుణాకర్, సీనియర్ కార్యకర్తలు మహిపాల్ రెడ్డి, లెనిన్, రామకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిబిరం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి కొత్తగూడెం :** చర్ల మండలం ఆర్ కొత్తగూడెం పంచాయతీ నందు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఈదయ్య పాల్గొని సర్పంచ్ తుర్రం.రవి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి దంత వైద్యశాలను ప్రారంభించారు. ఏజెన్సీలో నిరుపేద ప్రజలు దంత వైద్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన ఆత్మ కమిటీ చైర్మన్ ఇందుల బుచ్చిబాబు ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ పెద్దాడ. గీతానంద్ రోగులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి సుమారుగా 80 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దంత వైద్యులు మాట్లాడుతూ త్రాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండటం వలన దంత సమస్యలు ఏర్పడుతున్నాయని మానవునికి గుండె ఎంత ముఖ్యమో నమిలే దంతాలు కూడా అంతే ముఖ్యమని ఆహార పదార్థాలు తిన్న వెంటనే పుక్కిలిస్తే దంత సమస్యలు దరికి రావని కావున దంతాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని లేదంటే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఏజెన్సీలో నిరుపేద ప్రజల దంత సమస్యలను గుర్తించి ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఇందుల. బుచ్చిబాబును పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం. రవి, ఉప సర్పంచ్ కాపుల. కృష్ణార్జునరావు, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఏ.ఈఓ రామకృష్ణ, గొర్ల. రాజబాబు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# లేఅవుట్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని ఆదేశం

**స్పందించని చల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శి**

**అయోమయంలో 600మంది లబ్ధిదారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 600 ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్ ను రద్దు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని సర్వే నంబర్లలో ఉన్న డీటీల్ప్స్ లేఅవుట్ నం. 112/2019/హెచ్ ను రద్దు చేయడానికి సంబంధించి జిల్లా టౌన్ & కంట్రీ ప్లానింగ్ అధికారి, పంచాయతీ కార్యదర్శికి లేఖ రాశారు. డీటీసీపీ, డీపీవో సూచనల మేరకు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు (జి .ఓ .ఎం ఎస్ .నెంబర్ .67) ప్రకారం అవసరమైన చర్యలు తీసుకొని లేఅవుట్ రద్దు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

**హైకోర్టుకు చేరిన వ్యవహారం:**

యాదాద్రి భువనగిరి జిల్లా పంచాయతీ అధికారి జారీ చేసిన మెమోలో, శ్రీ కన్స్ట్రక్షన్స్ సంస్థకు 2019లో మంజూరైన డీటీల్ప్ నెంబర్ .112/2019/హెచ్. లేఅవుట్ అనుమతిపై వచ్చిన ఫిర్యాదు హైకోర్టు ఆదేశాల గురించి ప్రస్తావించారు.ఫిర్యాదు ప్రకారం, లేఅవుట్ అనుమతి పొందే సమయంలో దరఖాస్తుదారులు సర్వే నం.322/పి. లోని 15 ఎకరాల భూమి విక్రయ వివరాలను దాచిపెట్టారని డీటీ ఒసీపీ (టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) గుర్తించింది. లేఅవుట్ అనుమతిలోని షరతు నం.15 ప్రకారం, అనుమతి పొందడానికి తప్పుడు సమాచారం లేదా వాస్తవాలను దాచినట్లు తేలితే, లేఅవుట్ అనుమతిని ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేయవచ్చు. దీనిపై చర్యలు తీసుకోవాలని దాతర్‌పల్లి గ్రామపంచాయతీ (తుర్కపల్లి మండలం), చల్లూరు గ్రామపంచాయతీ (రాజపేట మండలం) కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. తీసుకున్న చర్యలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను డీటీ ఒసీపీ , హైదరాబాద్‌కు పంపాలని సూచించారు.

**ముఖ్యాంశం:**

లేఅవుట్ అనుమతి పొందేటప్పుడు భూమి విక్రయ వివరాలను దాచినట్లు ఆరోపణలు రావడంతో, ఆ లేఅవుట్ అనుమతిని రద్దు చేసే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. అనుమానాలకు తావిస్తున్న కార్యదర్శి వివరణ.. లేఅవుట్ రద్దు విషయంలో కార్యదర్శి వివరణ అనుమానాలకు తావిస్తోంది. ఆశ్చర్యానికి గురి చేస్తూ చర్చకు దారితీసింది.రాజపేట మండలం చల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి, డీటీల్ప్ లేఅవుట్ నం. 112/2019/హెచ్. రద్దు విషయంలో డీటీసీపీ అధికారులకు లేఖ రాశారు.

**లేఖలో ప్రధానంగా పేర్కొన్న అంశాలు....**

1. సుమారు 600 ప్లాట్లు ఇప్పటికే 2019--2025 మధ్య వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయ్యాయి. కాబట్టి ఆ యజమానులకు "థర్డ్ పార్టీ రైట్స్ " (మూడో పక్ష హక్కులు) ఏర్పడ్డాయి.

2. లేఅవుట్‌ను నేరుగా రద్దు చేయడం చట్టపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది. తెలంగాణ హైకోర్టు తీర్పుల ప్రకారం, ఆస్తి యజమానుల హక్కులను ప్రభావితం చేసే నిర్ణయాలకు ముందు వారికి నోటీసు ఇచ్చి వివరణ కోరాలి (ప్రిన్సిపుల్స్ అఫ్ నేచరల్ జస్టిస్ ).

3. నోటీసులు ఇవ్వకుండా లేఅవుట్ రద్దు చేస్తే, ప్లాట్ యజమానులు కోర్టులను ఆశ్రయించి రిట్ పిటిషన్లు, స్టే ఆర్డర్లు పొందే అవకాశం ఉంది. అలాగే అధికారులపై కోర్టు ధిక్కరణ (కాంటెంప్ట్ అఫ్ కోర్ట్ ) చర్యలు కూడా రావచ్చు.

4. జి .ఓ . మిస్ . నెంబర్ . 67 ప్రకారం డీటీసీపీ కు లేఅవుట్ అనుమతిని సవరించే (రివైస్ ) అధికారం ఉందని పేర్కొన్నారు.

5. అందువల్ల లేఅవుట్ రద్దు చేయడానికి ముందు ప్రతి ప్లాట్ యజమానికి 15 రోజుల షోకాజ్ నోటీసు జారీ చేయాలా? అనే విషయంపై మార్గదర్శకాలు ఇవ్వాలని డీటీసీపీ ను కోరారు.

6. ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన యజమానుల హక్కులు రక్షించబడే విధంగా షరతులతో కూడిన (కండిషనల్ ) రద్దు చేయాలని కూడా సూచించారు.

సారాంశంగా: చల్లూరు డీటీల్ప్ లేఅవుట్‌ను వెంటనే రద్దు చేయకుండా, ఇప్పటికే ప్లాట్లు కొనుగోలు చేసిన వారి హక్కులను పరిగణనలోకి తీసుకుని, వారికి నోటీసులు ఇచ్చిన తర్వాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి డీటీసీపీ కు విజ్ఞప్తి చేశారు

# చల్లూరు అక్రమ క్రషర్‌పై ప్రజాప్రతినిధులు అధికారులు మౌనం ఎందుకు?....

**మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి....**

**తప్పు చేసిన డెవలపర్లు, నిర్వాహకులు మరియు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి....**

**ప్లాట్ కొనుగోలుదారుల హక్కులను సంపూర్ణంగా కాపాడాలి.**

**విచారణ నివేదికను ప్రజలకు వెల్లడించాలి.....**

**భవిష్యత్తులో ఇలాంటి అక్రమ లేఅవుట్లు, అక్రమ క్రషర్లకు అడ్డుకట్ట వేయాలి.....**

**బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు మాధురి చంద్ర**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం, చల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని అక్రమ క్రషర్ వెంచర్లపై అధికారుల మౌనం వహించడానికి కారణం చెప్పాలని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర నాయకులు మాధురి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం రోజు ఆమె విలేకరులతో మాట్లాడారు. సర్వే నెం. 322/4లో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా నడుస్తున్న క్రషర్‌పై పలుమార్లు ప్రశ్నించినప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని బీజేపీ నాయకురాలు మాధురి చంద్ర విమర్శించారు. సుమారు నెల రోజుల క్రితం క్రషర్ నిర్వాహకులు శ్రీదేవి క్రషర్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అవసరమైన ఆధారాలను అందజేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలను ప్రజల ముందుంచలేదని ఆమె పేర్కొన్నారు.



గతంలో శ్రీ కన్స్ట్రక్షన్స్, శ్రీని డెవలపర్స్ పేర్లతో నిర్వహించబడిన ఈ క్రషర్‌ను ప్రస్తుతం జి.హెచ్.కే పేరుతో నిర్వహించాల్సిన అవసరం ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. క్రషర్ నిర్వహణలో భాగంగా జరుగుతున్న బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పశుపక్ష్యాదులు సహజ వనరులకు కూడా అపార నష్టం జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక కారణాలేమిటో వెల్లడించాలని కోరారు. డీటీసీపీ లేఅవుట్ అనుమతులు లేకుండానే అమాయక మధ్యతరగతి ప్రజలకు ప్లాట్లు విక్రయించి వారిని మోసం చేసిన అంశంపై కూడా పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ క్రషర్ వివాదాస్పద వెంచర్ వెనుక ఉన్న పెద్దల హస్తం ఏమిటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే, అధికారులపై ఉందని మాధురి చంద్ర పేర్కొన్నారు. సహజ వనరుల దోపిడీని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఈ అంశంపై ఎంత దూరమైనా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. చల్లూరు గ్రామ వాసిగా ప్రశ్నించే హక్కు తనకు ఉందని గుర్తు చేస్తూ, అక్రమ క్రషర్ వ్యవహారాన్ని పూర్తిగా వెలుగులోకి తీసుకువచ్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. చల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని డీటీల్ప్ లేఅవుట్ నం.112/2019/హెచ్ విషయంలో ప్రభుత్వం డీటీసీపీ అధికారులు స్వయంగా అక్రమాలు జరిగినట్లు గుర్తించి చర్యలకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో, చట్టాన్ని ఉల్లంఘించి అనుమతులు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అదే సమయంలో తమ జీవితకాల పొదుపులతో ప్లాట్లు కొనుగోలు చేసిన అమాయక ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.

# మరి కొన్నాళ్లపాటు ఇబ్బందులు తప్పవు

## : ప్రధాని మోదీ సంచలన ప్రకటన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, సెంట్రల్ బ్యూరో :**

ఫ్రాన్స్ లోని ఎవియాన్ వేదికగా జరిగిన అంతర్జాతీయ 52వ జీ7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ.. అందరికీ సమానమైన, సుస్థిరమైన ఆర్థిక అభివృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. ఈ విషయాల్ని తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా పోస్టు చేశారు. ఈ రోజు ఉన్న వాస్తవం ఏంటంటే..? వృద్ధి అంటే జీడీపీ లేదా వాణిజ్య అంకెలు కాదు.. నిజమైన ప్రశ్న ఏంటంటే..? వృద్ధి ఎవరి కోసం.. ఎవరికి.. ఏ దశలో అనేది ప్రధానం.. అని ప్రధాని మోదీ ప్రస్తావించారు.భారత వృద్ధి.. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే సూత్రంపై ఆధారపడి ఉంటుంది. అందువల్లనే భారత్ జీ 20 దేశాల సమావేశానికి అధ్యక్షత వహించింది.. ఇండియా- మిడిల్ ఈస్ట్- యూరోప్ ఎకనామిక్ కారిడార్ లో కీలక పాత్ర పోషించింది.. అని తెలిపారు.అలాగే పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ప్రస్తుతం అంతర్జాతీయంగా ఇంధనం, ఎరువులు, ఫుడ్ సరఫరా చెయిన్ లో అంతరాయాలు మరికొంత కాలంపాటు ఉంటాయి. మరికొంత కాలం ఇబ్బందులు తప్పవు.. ఈ క్లిష్ట సమయంలో మనం ప్రపంచానికి సానుభూతి ప్రకటించాలంటే.. ఈ సంక్షోభంలో అధికంగా ఇబ్బంది పడుతున్న పేద దేశాలకు చేయూతనివ్వాలి.. వారిని ఒంటరిగా వదిలేయొద్దు అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం అంతర్జాతీయ ఫైనాన్షియల్



సంస్థలు పలు నిర్ణయాలతో రావాలని తెలిపారు.ఇండియా- మిడిల్ ఈస్ట్- యూరోప్ ఎకనామిక్ కారిడార్.. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు.. దాని విజయవంతమైన నమూనాను ప్రపంచవ్యాప్తంగా అందించాలనేది దాని విజన్.. జీ 7 దేశాల సమ్మిట్ లో ప్రతిపాదించిన (ఇంటర్నేషనల్ మొబిలైజేషన్ పార్ట్ నర్ షిప్ ఫర్ యాక్జిలరేటింగ్ కనెక్టివిటీ అండ్ ట్రేడ్) అనే కూటమి.. గ్లోబల్ గవర్నెన్స్ లో లోపాలను సరిచేయగలదని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా అభిప్రాయపడ్డారు. జీ 7 దేశాల పెట్టుబడి, భారత్ ప్రతిభ, అలాగే గ్లోబల్ సౌత్ దేశాల యాజమాన్యం ప్రపంచ వాణిజ్యంలో గేమ్ ఛేంజర్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాలు మానవ వనరుల కొరతను ఎందర్కొంటున్నాయని.. కానీ భారత్, అలాగే గ్లోబల్ సౌత్ దేశాల్లో యువత, టాలెంట్ అధికం అని ప్రధాని మోదీ తెలిపారు. ఆ దేశాలలో ఉన్న యువత కొరతను.. గ్లోబల్ సౌత్ దేశాలలో ఉన్న యువ శక్తితో గ్లోబల్ స్కిల్స్ పార్ట్ నర్ షిప్ ఒక బలమైన వారధిగా మారుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించిన ఎంఈఓ చందా రమేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం సింగారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి చందా రమేష్, సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామ సర్పంచ్ లు పాల్గొని అక్షరాభ్యాస కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఒకటవ తరగతిలో నూతనముగా 20 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఈ కార్యక్రమం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సింగారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు


## మృతురాలి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ బియ్యం పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం సోమరం గ్రామానికి చెందిన బల్లెం సుగుణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బుధవారం రోజు వారి కుటుంబానికి ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ అనిత సహకారంతో 50 కిలోల బియ్యం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సోమరం గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మకంటి జంపయ్య, సీనియర్ నాయకులు బొమ్మకంటి సిద్దిరాజ్, బూడిద సురేష్ గౌడ్, గిరిరాజు స్వామి, అంజనేయులు, తమ్మడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ స్కూల్ పోస్టులకు 111 దరఖాస్తులు....

**రాజపేట (ఎంఈఓ) మండల విద్యాధికారి చందా రమేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని ఎనిమిది గ్రామాలలో మంజూరి అయిన ప్రీ ప్రైమరీ స్కూల్ ఆయా, ఇన్స్ట్రక్టర్ పోస్టులకు 111 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బుధవారం (ఎంఈఓ) మండల విద్యాధికారి చందా రమేష్ విలేకరులకు వివరాలు తెలుపారు. ఈనెల 16వ తేదీ వరకు చివరి రోజు దరఖాస్తులు చేసేందుకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. సింగారం, పాముకుంట, పుట్టగూడెం, బొందుగుల, దూది వెంకటాపురం, రఘునాథపురం, చల్లూరు, బేగంపేట గ్రామాలలో ప్రీ ప్రైమరీ స్కూల్లు మంజూరి అయినట్లు వివరించారు. సింగారం పాఠశాలకు 7 ఇన్స్ట్రక్టర్ , 4 ఆయా దరఖాస్తులు రాగా, పాముకుంట గ్రామానికి ఇన్స్ట్రక్టర్ 16, ఆయా నాలుగు దరఖాస్తులు, పుట్టగూడెం ఇన్స్ట్రక్టర్ ఆరు, ఆయా 2 దరఖాస్తులు, బొందుగుల ఇన్స్ట్రక్టర్ 15, ఆయా 5 దరఖాస్తులు, దూది వెంకటాపురం ఇన్స్ట్రక్టర్ 9, ఆయా 5 దరఖాస్తులు, రఘునాథపురం గ్రామానికి ఇన్స్ట్రక్టర్ 17, ఆయా మూడు దరఖాస్తులు, చల్లూరు ఇన్స్ట్రక్టర్ ఆరు, ఆయాకు రెండు దరఖాస్తులు, బేగంపేట గ్రామానికి ఇన్స్ట్రక్టర్ పోస్టుకు 9 ఆయా పోస్టుకు కేవలం ఒక దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు ఎంఈఓ వివరించారు. మొత్తం ఎనిమిది పాఠశాలలకు 8 ఇన్స్ట్రక్టర్ పోస్టులకు 85 దరఖాస్తులు రాగా, 8 ఆయా పోస్టులకు 26 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. త్వరలోనే ప్రత్యేక కమిటీ ద్వారా ఎంపిక జరుగుతుందని చెప్పారు.

హైదరాబాద్ పల్స్

# ముదిరాజ్ సంఘం భవనం భూమి పూజా.....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూదివెంకటపురం గ్రామంలో ముదిరాజ్ సంఘం భవనం భూమి పూజా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్, ఉపసర్పంచ్ ఇరుగదిండ్ల వెంకటేష్ మరియు వార్డ్ సభ్యులు బీమగని విఘ్నేష్, భీమగని మహేష్, దగ్గుల రేణుక, మహమ్మద్, రేష్మ, గ్రామ శాఖ అధ్యక్షులు వగల బిక్షపతి, ఓబీసీల్ మండల అధ్యక్షులు మంగ కృష్ణ, ఓబీసీల్ అధ్యక్షులు గాదె సురేష్, యూత్ అధ్యక్షులు గోడిశేల నగేష్, సోషల్ మీడియా కన్వీనియర్ భీమగాని కర్ణాకర్, నకీర్త కనకరాజ్ కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ కులం పెద్ద నీల కుమార్, అధ్యక్షులు నీల మధుసూదన్, కార్యదర్శి ఏదుల సత్యనారాయణ మరియు కులం సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా "అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం" ప్రారంభం

### ముఖ్య అతిథిగా పాల్గొని అక్షరాభ్యాసం చేయించిన సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్




**హైదరాబాద్ పల్స్, జూన్ 17, షాద్నగర్ :**
నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడ గ్రామంలో నేడు "అమ్మ మాట అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాళ్ల గూడ సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలలో ప్రస్తుతం విద్యను అభ్యసించే పిల్లలకు ప్రత్యేకమైనటువంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, పౌష్టికాహారం మరియు ప్రాథమిక ఉన్నతమైన విద్య మరియు ఆరోగ్యం తదితర అంశాలపై తల్లిదండ్రులు అవగాహన పెంపొందించుకొని తమ పిల్లలను అంగన్వాడి సెంటర్లకు రోజు పంపించాలని అన్నారు. పిల్లల అభివృద్ధికి పునాది అంగన్వాడి కేంద్రం కాబట్టి మానసికంగా మరియు శారీరకంగా ఎదగడానికి ఎంతో తోడ్పాటు పడుతుందని అన్ని విధాల వారి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలకు అన్నప్రాస కార్యక్రమం నిర్వహించి వారితో అక్షరాభ్యాసం చేయించారు. పిల్లల తోడ్పాటుకు సహకారం అందిస్తున్న అంగన్వాడి టీచర్ చైతన్య ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటయ్య గౌడ్ అంగన్వాడి టీచర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కష్టమర్లకు నాణ్యమైన భోజనం అందించాలి....

### ఆలేరు ఎస్ఐ యాలాద్రి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కష్టమర్లకు నాణ్యమైన భోజనం అందించాలని ఆలేరు ఎస్ఐ యాలాద్రి అన్నారు. బుధవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శివ బాలాజీ రెస్టారెంట్ ను సర్పంచ్ బెదర బోయిన యాకమ్మ వెంకటేష్ తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు మామిడాల సాగర్, మాజీ సర్పంచ్ మోత్కూరి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ ఆరే ప్రశాంత్ గౌడ్, వార్డు సభ్యులు బొంకూరి మల్లేష్, మామిడాల ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

# 'భూ భారతి - భూముల రీ సర్వే' గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, నారాయణఖేడ్ :**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన లోపభూయిష్టమైన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణలో పేద ప్రజల భూములకు తీరని అన్యాయం జరిగిందని, అమాయకుల భూములు కబ్జాల పాలు కావడానికి ఆ పోర్టలే కారణమైందని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం శంకరంపేట్ (ఎ) మండల పరిధిలోని జుక్కల్ గ్రామంలో నిర్వహించిన "భూ భారతి – భూముల రీ సర్వే" గ్రామ సభ అవగాహన సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధరణి లోపాల ఆధారంగా బీఆర్ఎస్ నాయకులు యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడ్డారని, పేద రైతుల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. ధరణి పోర్టల్ వల్ల ఎంతోమంది నిజమైన లబ్ధిదారులు తమ సొంత భూములపై హక్కులు కోల్పోయి, కార్యాలయాల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని



పేద ప్రజల భూములను అక్రమంగా గుంజుకున్నారని, నాటి ప్రభుత్వం వారికి పూర్తిగా సహకరించిందని మండిపడ్డారు. ప్రతి గింజ భూమికి స్పష్టమైన హక్కులు కల్పించడమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం 'భూ భారతి' రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ఈ సర్వే ద్వారా భూ వివాదాలన్నింటికీ శాశ్వత పరిష్కారం లభిస్తుందని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క పేదవాడి భూమి అన్యాయం కాకుండా చూస్తామని, అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతుల భూములకు శాశ్వత రక్షణ కల్పించేందుకు, ఎలాంటి సరిహద్దు తగాదాలు లేకుండా చూసేందుకే ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ 'భూ భారతి' భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఆధునిక



సాంకేతిక పరిజ్ఞానంతో జరిగే ఈ సర్వే ద్వారా ప్రతి ఒక్కరి భూమికి స్పష్టమైన డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గతంలో ఉన్న భూ రికార్డుల లోపాలను సవరించి, పారదర్శకంగా భూముల సరిహద్దులను నిర్ణయించడానికి ఈ గ్రామ సభలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. జుక్కల్ గ్రామ రైతులందరూ సర్వే అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన పత్రాలను చూపి రీ సర్వేను విజయవంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భూ వివాదాలు లేని గ్రామంగా జుక్కల్ నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు జుక్కల్ గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల వలయంగా మేడ్చల్ బస్సు ప్రయాణ ప్రాంగణం

### ప్రాంగణంలో ప్రయాణికులకు, సిబ్బందికి తీరని కష్టాలు

## బస్సు స్టాండ్ ప్రధాన దారి ముసివేత

హైదరాబాద్ పల్స్ స్పెషల్ స్టోరీ

**మేడ్చల్ పట్టణం, జూన్ 17, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ప్రయాణ ప్రాంగణం ప్రధాన ముఖ ద్వారం మూసి వేసి బస్సులు వెళ్లే మార్గాన ప్రయాణికులను వెళ్లేలా చేయడం వల్ల ప్రయాణికుల ఇక్కట్లు మరియు ప్రమాదకరం. ప్రధాన ముఖ ద్వారం ఎందుకు మూసి వేసారో ప్రయాణికులకు చెప్పాలి. ప్రధాన ముఖ ద్వారం వద్ద టీ.జి.ఎస్.ఆర్.టీ.సి పార్సిల్ విభాగాన్ని ఏర్పాటు చేసి













ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా చేస్తున్న డిపో యాజమాన్యం, అక్కడ పార్సిల్ విభాగం ఎందుకు పెట్టారో ప్రధాన ముఖ ద్వారాన్ని ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రయాణీలకు సంక్షేమం మీద లేదని పలువురు ప్రయాణికులు మేడ్చల్ డిపో యాజమాన్యాన్ని విమర్శిస్తున్నారు.

**ప్రాంగణం చుట్టూ గుంతలమయం, ప్రమాదకరం**

ముఖ్యంగా చూసుకుంటే ప్రయాణ ప్రాంగణం ప్రధాన రోడ్డు ఫ్లైఓవర్ కోసం చెప్పట్టిన పనులు ఆగడం వల్ల ప్రహరీ గోడ భాగం మరియు ఆటోలు నిలిపే స్థలం చుట్టూ గుంతలు ఏర్పడి, డ్రైనేజీ వెళ్లే కాలువలు ప్రమాదకరంగా మరి ప్రయాణికులు ఇబ్బంది పడడం, డ్రైనేజీ నీరు ప్రవాహం దారి మళ్ళి పోవడం, సమస్యగా మారిపోతుంది, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కానీ డిపో అధికారులు కానీ పట్టించుకోవాలని అన్ని జిల్లాలలో ప్రయాణ ప్రాంగణాలు చక్క రూపు దిద్దుకుంటున్నాయని, మేడ్చల్ బస్సు ప్రయాణ ప్రాంగణం మాత్రం గత కొన్ని ఏండ్ల నుండి అభివృద్ధికి నోచుకోడం లేదని వాపోతున్నారు.

**ప్రాంగణంలో నీటి నిల్వలు, దుర్గంధ భరితం**

ప్రయాణ ప్రాంగణంలో ఎటు చూసినా నీటి నిల్వల వల్ల దోమలు, ఈగల బెడదా, దుర్వసన తయారు అవుతుందని, దీనివల్ల ప్రయాణికులు చెప్పుకోలేని దుస్థితిని అనుభవిస్తున్నారని ఇప్పటికైనా అధికారులు నీటి నిల్వలపై దృష్టి పెట్టి చదును చేయాలని పలువురు హైదరాబాద్ పల్స్ పత్రిక ద్వారా కోరుకుంటున్నారు.

**ప్రయాణ ప్రాంగణంలో బస్సుల కోసం ప్రయాణికుల ఇక్కట్లు**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం వచ్చాక సమయానికి బస్సులు రాక గత రెండేళ్ల నుండి సికింద్రాబాద్ నుండి మేడ్చల్ వచ్చే బస్సుల తగ్గింపు వల్ల ఉదయం వేళ బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ నుండి మేడ్చల్ మేడ్చల్ నుండి సికింద్రాబాద్ వెళ్లే బస్సు రూట్లలో బస్సులు లేక విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, వృత్తిదారులు, వివిధ ప్రాంత ప్రయాణికులు ప్రజలు చాలాసార్లు డిపో యాజమాన్యానికి తెలిపిన పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇకనైనా బస్సుల పెంపు చెయాలనీ డిపో మేనేజర్ ని కోరారు.

**ప్రాంగణంలో ఎక్కడా చూసిన చెత్తా చెదారమే**

ముఖ్యంగా ప్రయాణ ప్రాంగణం చుట్టు ఆరుబయట మూత్ర విసర్జన, కుళ్ళిన పండ్లను వేయడం, చెత్తను వేయడం పరిపాటి అయ్యింది. బస్సులు వెళ్లి వచ్చే దారిలో చెత్తను, గృహోపకరణ వస్తువులను వేస్తూ ఉన్నారు. డిపో అధికారులు, మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మహిళలకు "పింక్ ట్యాక్స్"పై బంపరాఫర్: పాక్ ప్రభుత్వం సంచలన నిర్ణయం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17 :**
పాకిస్థాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళ పరిశుభ్రత, ఆరోగ్య ఉత్పత్తులపై ఇప్పటివరకు విధిస్తూ వచ్చిన 'పీరియడ్ ట్యాక్స్'ను పాక్ సర్కారు పూర్తిగా రద్దు చేసింది. 'పీరియడ్ ట్యాక్స్'ను పింక్ ట్యాక్స్ అని కూడా పిలుస్తారు. మరోవైపు గర్భనిరోధక సాధనాలను కూడా పన్ను రహితంగా మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దేశ ప్రజలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పాక్ సమాచార శాఖ మంత్రి అతావుల్లా త్రార్ అధికారికంగా ప్రకటించారు. పాకిస్థాన్‌లోని మహిళా హక్కుల సంఘాలు, సామాజిక సంస్థలు ఈ పీరియడ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని గత కొంతకాలంగా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి.

**అసలు ఈ 'పీరియడ్ ట్యాక్స్' అంటే ఏంటి?**

మహిళలు రుతుస్రావ సమయంలో ఉపయోగించే శానిటరీ ప్యాడ్‌లు, టాంపూన్‌లు వంటి అవసరమైన ఉత్పత్తులపై ప్రభుత్వం విధించే అదనపు విక్రయ పన్నును పీరియడ్ ట్యాక్స్ లేదా పింక్ ట్యాక్స్ అని



పిలుస్తారు. పాకిస్థాన్‌లో ఈ ఉత్పత్తులపై గతంలో 18 శాతం వరకు సేల్స్ ట్యాక్స్ వసూలు చేసేవారు. ఈ అదనపు పన్నుల కారణంగా మార్కెట్లో శానిటరీ ప్యాడ్ల ధరలు దాదాపు 40 శాతం వరకు పెరిగిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని, పేద కుటుంబాలకు చెందిన మహిళలకు, యువతులకు ఇవి అందుబాటులో లేకుండా పోయాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ ఉత్పత్తులపై పన్ను 18 శాతం నుంచి 0 శాతానికి పడిపోయింది.

**గర్భనిరోధకాలపైనా పన్ను మినహాయింపు:**

మహిళల ఆరోగ్య ఉత్పత్తులతో పాటు దేశంలో పెరుగుతున్న జనాభా నియంత్రణను దృష్టిలో ఉంచుకుని గర్భనిరోధక సాధనాలపై కూడా పన్నులను పాకిస్థాన్ ప్రభుత్వం పూర్తిగా మినహాయించింది. ప్రస్తుతం పాకిస్థాన్ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో జనాభా పెరుగుదల ఒకటని.. అందుకే రాబోయే ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో వీటికి పన్ను రహిత హోదా కల్పించినట్లు మంత్రి అతావుల్లా త్రార్ నేషనల్ అసెంబ్లీలో వెల్లడించారు. ఈ బడ్జెట్ దేశాన్ని ఆర్థిక పురోగతి వైపు నడిపించే ఓ రిలీఫ్ బడ్జెట్ అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

**మహిళా సంఘాల హర్షం**

పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంపై అక్కడి మహిళా హక్కుల సంస్థలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళల పునరుత్పత్తి హక్కులు, రుతుస్రావ సమతుల్యత కోసం పోరాడుతున్న మహ్వారీ జస్టిస్ సంస్థ ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. అలాగే టైమ్స్ మ్యాగజైన్ 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్ 2026' జాబితాలో నిలిచిన పాకిస్తాన్ ప్రముఖ మహిళా హక్కుల కార్యకర్త మహనూర్ ఒమర్ కూడా ప్రభుత్వ చొరవను అభినందించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దాం

**టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ కర్ర అనిల్ రెడ్డి**

**హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పిలుపు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి కొత్తగూడెం:**
జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా హైదరాబాద్‌లో గురువారం జరగనున్న భారీ బహిరంగ సభకు చర్ల మండలంలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో తరలిరావాలని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ కర్ర అనిల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక చర్లమండలంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమన్న ఆధ్వర్యంలో జరగబోయే ఈ సభ చర్విత చరణం కాకుండా, ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు మీడియా



రంగంలో ఎదుర్కొంటున్న పలు క్లిష్ట పరిస్థితులను చర్చించారు. వృత్తి రీత్యా నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులకు తగిన ఆరోగ్య భీమా, ప్రమాద భీమా సౌకర్యాలు లేకపోవడం వల్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. చాలా మంది జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేని దుస్థితి ఉంది, ప్రభుత్వాలు గతంలో హామీ ఇచ్చిన విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహాలను కేటాయించాలి. వార్తలు రాసినప్పుడు లేదా ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చినప్పుడు కొందరు వ్యక్తుల నుంచి ఎదురయ్యే బెదిరింపులు, భౌతిక దాడుల నుండి రక్షణ కల్పించేలా కఠినమైన 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను అమలు చేయాలని, వయసు పైబడిన మరియు అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి గౌరవప్రదమైన పెన్షన్ అందజేయాలని, రాష్ట్ర మరియు జిల్లా నాయకులు కోరారు,ఈ అత్యవసర సమావేశంలో చర్ల మండల టిడబ్ల్యూజేఎఫ్ సభ్యులు తోటమల్ల రమణమూర్తి, దొడ్డి హరినాగ వర్మ, జి.లక్ష్మణ్ కుమార్, ఎంఎల్ఎన్ రెడ్డి, గూబ సురేష్ తదితరులు పాల్గొన్నారు, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితంగా పోరాడాలని, హైదరాబాద్ సభను జయప్రదం చేయడం ద్వారా ప్రభుత్వానికి మన ఐక్యతను చాటాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియు సభ్యులందరికీ వారు పిలుపునిచ్చారు.

# ఘనంగా త్రిశక్తి మహా గాయత్రి యజ్ఞం పూర్ణాహుతి పూజలు.....

**పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ దంపతులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి: భువనగిరి శ్రీ దివ్యజ్ఞాన గురూజి ఆధ్వర్యంలో అధిక జ్యేష్ఠ మాసం సందర్భంగా మే 15 నుండి జూన్ 16 వరకు 33 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించిన శ్రీ త్రిశక్తి మహాగాయత్రి జ్ఞాన యజ్ఞం మహాపూర్ణాహుతి కార్యక్రమం బుధవారం ఆనందగిరి, అండాల్ నగర్‌లోని శ్రీ త్రిశక్తి మహాగాయత్రి మందిరంలో ఘనంగా ముగిసింది. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కిరణ్ జ్యోతి రెడ్డి దంపతులు, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగెళ్ళపల్లి రవికుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులను మరియు పట్టణ మున్సిపల్



చైర్మన్ తంగా ళ్ల పల్లి శ్రీవాణి రవికుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... 33 రోజుల పాటు నిర్విరామంగా జ్ఞాన యజ్ఞాన్ని నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ... గాయత్రి యజ్ఞం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని, నియోజకవర్గ ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక




పూజలు చేశామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. మహాపూర్ణాహుతి అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణమూర్తి, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి కాసుభ శ్రీనివాస్ రావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్, పట్టణ కౌన్సిలర్లు మరియు తోటకూర వెంకటేష్ యాదవ్, బబ్లు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు చందు, పట్ల వెంకటేశ్వర్ రావు, విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ ప్రజల సంక్షేమమే బోర్డు లక్ష్యం

**ప్రజల సంక్షేమం కోసం పని చేయండి నిధులు ఎన్ని కావాలన్నా తీసుకొని వస్తాం**

**సీఈవో పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మల్కాజ్గిరి ఎంపీ.**

సికింద్రాబాద్, జూన్ 17,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి : కంటోన్మెంట్ బోర్డు మీటింగులో పాల్గొన్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కంటోన్మెంట్ భూముల అమ్మకం ద్వారా వచ్చిన 303 కోట్ల రూపాయలతో కంటోన్మెంట్లో సమగ్ర అభివృద్ధిని చేస్తున్నాము. మంచి నీటి సరఫరా,డ్రైనేజ్ వ్యవస్థలకు శాశ్వతంగా పరిష్కారం అందిస్తున్నాము. రాబోయే 40 ఏళ్లకు అనుగుణంగా డ్రైనేజ్ వ్యవస్థను సిద్ధం చేస్తున్నాము. అనుభవమున్న, సమర్థవంతమైన కాంట్రాక్టర్ కు పని ఇవ్వాలని.. నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలాగా చూడాలని కంటోన్మెంట్ అధికారులకు సూచించాము. గతంలో తప్పుడు రిపోర్టులతో షాపులను కూలగొట్టారు, వారికి తగిన న్యాయం చేయాలని కోరాము.కంటోన్మెంట్ కి కొత్తగా వచ్చిన సీఈఓ పూర్తిగా నెగెటివ్ మైండ్ తో ఉన్నారు.ఏం చెప్పినా సరిగా స్పందించడం లేదు. కంటోన్మెంట్ అభివృద్ధి కోసం రాకేష్ మిట్టల్ ని కోరితే 20 కోట్లు మంజూరు చేశారు. మరో 10 కోట్లు చేస్తా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన స్టాంప్ డ్యూటీ పైసలు 25 కోట్ల రూపాయలు కూడా అధికారులతో మాట్లాడి తెప్పించాము. డబ్బులకు కొరతలేకున్నా పనులు చేయడంలో సీఈఓ సుముఖంగా లేరు. కంటోన్మెంట్ అంటే మేమే రాజా అనే భావన మంచిది కాదు. ఒకనాడు కంటోన్మెంట్ ఆసుపత్రి బాగుండేది కానీ ఇప్పుడు నిర్వీర్యం చేశారు. నిధులు తెచ్చే బాధ్యత మాది.పనులు చేయండి తప్ప డబ్బులు లేవు అని ప్రజల అవసరాలను పక్కన పెట్టవద్దు. సర్వే నంబర్ 57/1, 157/1 రెండు గ్రామాల మధ్య వివాదం.. ప్రభుత్వ భూమిని ఉర్దూ పేపర్లో పుట్టించి వాటిని తర్జుమా చేసి ప్రైవేటు భూమిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కాపాడాల్సిన ప్రభుత్వమే కంచే చేయనుని మేసినట్లు




వ్యవహరిస్తుంది. నాలుగు తరాలుగా ఉంటున్న భూములను ప్రైవేటుపరం చేశారు. దానిని మరోసారి రివ్యూ చేయాలని కోరుతున్నాను.అధికారులు ప్రజలకు సేవకులు అని మరిచిపోయి పైరవీకారులకు కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారు. పేదలకు అండగా ఉంటాము.వారి భూములు పోకుండా బాధ్యత తీసుకుంటాము. భూములలో లిటిగేషన్ తో డాక్యుమెంట్లు సృష్టించుకుని అవినీతి అధికారులు వచ్చేంత వరకు వేచి చూసి దొంగ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు ప్రభుత్వంతో రాజీపడి ఇలాంటి పనులు చేస్తారు.దీనిని సహించేది లేదని పేర్కొన్నారు.

# ప్రజా సేవలో అంకితభావానికి నిదర్శనం

**గిరిజన ఉత్తమ సేవ అవార్డు పొందిన మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి**

**ప్రజల మన్ననలు పొందుతున్న సేవా దృక్పథం**

**ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్యశాల అందించడం లక్ష్యం**

**సేవా భావంతో అందరి ప్రశంసలు అందుకుంటున్న సూపరిండెంట్ గౌరీ ప్రసాద్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
మణుగూరు: ఏజెన్సీ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ, పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణతో ముందుకు సాగుతున్న మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల మన్ననలు పొందుతోంది. వైద్య సేవల విస్తరణ, రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసినందుకు ఆసుపత్రి ఇటీవల గిరిజన ఉత్తమ సేవ అవార్డును అందుకోవడం విశేషం.ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ నాయకత్వంలో వైద్య సేవలు మరింత



మెరుగుపడుతున్నాయని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ, ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. క్రమశిక్షణ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న ఆయన సేవా దృక్పథం ప్రజల ప్రశంసలను అందుకుంటోంది.సిబ్బందితో సమన్వయమే ఆసుపత్రి అభివృద్ధి విజయ రహస్యంగా నిలిచిందని పలువురు పేర్కొంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులోనూ ఆసుపత్రి ముందంజలో ఉంది. వైద్య పరికరాల వినియోగం, పరిశుభ్రత, రోగులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అత్యవసర వైద్య సేవల బలోపేతం వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీంతో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగింది. ప్రత్యేకించి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోంది. మారుమూల గ్రామాల నుంచి వచ్చే గిరిజనులకు సులభంగా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి అందిస్తున్న సేవలు ప్రజల ప్రశంసలను పొందుతున్నాయి. సేవా భావంతో పనిచేస్తూ, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో సూపరిండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజా సేవే పరమావధిగా భావించి ముందుకు సాగుతున్న మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి జిల్లాలోనే ఆదర్శ ఆసుపత్రిగా నిలుస్తోందని పలువురు కొనియాడుతున్నారు.

## బూడిదైనా ఇవ్వండంటూ తల్లి ఆవేదన... సంచలనంగా సాయికృష్ణ మిస్సింగ్ కేసు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, ఆంధ్రప్రదేశ్ డెస్క్:**
విజయవాడ రౌడీషీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసు రాష్ట్రంలో సంచలనానికి దారితీసింది. తన కొడుకును సీఐ నాగరాజు చంపేశాడని తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నారు. చేసిందంతా చేసి.. తనకేమీ తెలీదని ఎలా మాట్లాడుతున్నాడని వాపోయారు. తన కొడుకును ముమ్మాటికీ లాకప్ లోనే చంపేశారని, ఇప్పుడు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు. తప్పు చేస్తే శిక్షించాలి గానీ.. చంపేసే హక్కెవరిచ్చారని కృష్ణలంక పోలీసులను మీడియా ముఖంగా ఆమె నిలదీశారు. తమకు పార్టీలతో సంబంధం లేదన్న విజయలక్ష్మి.. తన కొడుకు తనకు కావాలని, ఎవరైనా తీసుకొచ్చి చూపించాలని కన్నీళ్లతో వేడుకున్నారు. బ్రతికి ఉంటే కొడుకును చూపించండి.. లేదంటే దహనం చేసిన మట్టైనా ఇవ్వండంటూ గుండెలు బాదుకున్నారు. తనకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకూడదని, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మరోవైపు సాయికృష్ణ మేనమామ కృష్ణలంక పోలీసులపై సంచలన ఆరోపణలు చేశారు. సీఐ నాగరాజు, స్టేషన్ సిబ్బంది కలిసి సాయికృష్ణను చంపేశారన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అశోక్, బాబురావు, సుబ్రమణ్యంలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని, న్యాయం కోసమే పోరాడుతున్నామన్నారు. సస్పెండ్ చేయడమంటే వీఆర్ కు పంపడమా? వ్యక్తి మిస్సింగ్ పై కనీస బాధ్యత వహించాల్సిన అవసరం పోలీసులకు లేదా? అని నిలదీశారు. న్యాయం చేయడం చేతకాకపోతే గాజులు వేసుకుని ఇళ్లలో కూర్చోవాలంటూ సాయికృష్ణ మేనమామ ఫైరయ్యారు.

## స్కూల్ ఆధార్ క్యాంప్ ప్రారంభించిన ఎంఈఓ




**హైదరాబాద్ పల్స్, జూన్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల సౌకర్యార్థం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ ఆధార్ క్యాంప్ 17 జూన్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను కొత్తగూడెం మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మధురవాని ప్రారంభించారు. మండల సమగ్ర శిక్ష ఆపరేటర్ మహంకాళి రఘువీర్ ఆధ్వర్యంలో ఈ క్యాంప్ ప్రక్రియ మండలలోని అన్ని విద్యాలయలో కొనసాగుతోంది.

## పుస్తకాలు పంపిణీ చేసిన కార్పొరేటర్ ఆకాంక్ష

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ పడాల ఆకాంక్ష**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పాత కొత్తగూడెం, 11వ డివిజన్ లో బుధవారం ఉదయం కార్పొరేటర్ ఆకాంక్ష పడాల చేతుల మీదగా తెలంగాణ పాఠశాల లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 11వ డివిజన్ కార్పొరేటర్ పడాల ఆకాంక్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో కూడా రాణించాలని, గురువును మించిన దైవం లేదని గురువులని ప్రేమించాలని, వారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్ పెద్దలు నాయకులు పడాల భవాని ప్రసాద్, నిమ్మలగడ్డ వెంకటేశ్వర్లు కుంపటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన ఇంధనం.. స్వచ్ఛమైన తాగునీరు.. దోర్నకల్ ప్రజలకు అందుబాటులోకి కొత్త సేవలు



**హైదరాబాద్ పల్స్, జూన్ 17, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** దోర్నకల్ పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా మరో కీలక అడుగు పడింది. పట్టణ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన వామిక ఇండియన్ పెట్రోల్ బంక్‌తో పాటు ఐజెల్ వాటర్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్, దోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ బుధవారం ఘనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడం ఫిల్లింగ్ స్టేషన్ల ప్రధాన బాధ్యత అని అన్నారు. సేవల విషయంలో రాజీ పడకుండా వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛమైన తాగునీరు ప్రజారోగ్యానికి ఎంతో అవసరమని, ఐజెల్ వాటర్ ప్లాంట్ ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన నీరు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వామిక ఇండియన్ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం 15వ వార్డు కౌన్సిలర్ గారా రమేష్ ఏర్పాటు చేసిన ఐజెల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యాపార, సేవా రంగాల్లో కొత్త సంస్థలు ఏర్పడటం స్థానిక అభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దోర్నకల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండేటి రాజకుమారి హరినాథ్‌బాబు, వైస్ చైర్‌పర్సన్ మాదా లావణ్య శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, వార్డు కౌన్సిలర్లు, మైనార్టీ అధ్యక్షులు ఖాదర్ బాబా, ఫరీద్, కాసం శేఖర్, ఆంగోత్ వెంకన్న, రాయల వెంకట బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నివాస గృహాల్లో ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కింది...!

**నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి**

**కోహిర్ పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా చేస్తాం : మున్సిపల్ చైర్మన్ ఏం. అశోక్**

**పలు వార్డుల్లో మెరుగైన విద్యుత్ కోసం 100 కెవి లైన్ ను ప్రారంభించిన చైర్మన్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, జహీరాబాద్ :** 24 గంటలు పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చెయ్యడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని గెలిచినా ఆరు నెలల్లో అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే అని కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఏం. అశోక్ అన్నారు. బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా శాసన సభ పరిధి కోహిర్ పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం చైర్మన్ ఏం అశోక్ స్థానిక కౌన్సిలర్ లతో కలిసి 100 కెవి విద్యుత్ లైన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అనేక కార్యక్రమలు అమలు చేస్తుందని, కోహిర్ పట్టణ కేంద్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం కోసం నిరంతరం కృషి చేస్తూ కోహిర్ పట్టణ అభివృద్ధి కోసం అందరి సహకారంతో ముందుకు వెళ్తామని, పలు వార్డుల్లో విద్యుత్ సమస్యను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నాన్ జావీద్, కౌన్సిలర్లు చాంద్ ఖురేషి, సనా అస్లాం జైద్, అమ్ము, మాజీ ఎంపిపి షౌకత్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానూర్‌లో పంచాయతీ కార్యదర్శుల వీడ్కోలు - నూతన కార్యదర్శులకు ఘన స్వాగత సన్మానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, మానూర్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలో మానూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ వీడ్కోలు, నూతన కార్యదర్శుల స్వాగత సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డివిజనల్ పంచాయతీ అధికారికి శాలువా, పూలమాలలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ వారు మండల అభివృద్ధికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే బదిలీపై మనూర్ మండలానికి నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బదిలీలు ఉద్యోగ జీవితంలో సహజమైన భాగమని, కొత్తగా వచ్చిన కార్యదర్శులు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు మరియు మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శుల సేవలు గ్రామాల అభివృద్ధికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆత్మీయ



వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలన సమర్థవంతంగా అమలు చేయాలి

**జిల్లా వైద్య ఢ ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** జిల్లా వైద్య ఢ ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఢ ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన జిల్లా కుష్టు నిర్మూలన కార్యక్రమాల పై డిపిఎంఓలు (లెప్రసీ) హెల్త్ ఎడ్యుకేటర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధి అనుమానితులను త్వరితగతిన గుర్తించి పరీక్షలు నిర్వహించి, నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ ఎండిటి చికిత్స ప్రారంభించి పూర్తిస్థాయిలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఆరోగ్య కేంద్ర పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణను క్రమం తప్పకుండా



నిర్వహించాలని తెలిపారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ పద్ధతులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతేకాకుండా ఐఈసీ బీసీసీ కార్యక్రమాలను బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించడం, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో చేతబడి, బాణమతి క్షుద్ర పూజలు మూఢనమ్మకాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని ఆరోగ్య విద్యా బోధకులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్, భద్రూ పీజీయోతెరపిస్ట్, మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎద్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి ,బేబీ , వినయ్ కుమార్, బద్రు, ప్రతిభ, సంబంధిత జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గుడ్ న్యూస్: సంగారెడ్డి జిల్లాలో రూ.500 కోట్లతో పల్సస్ ఐటీ పార్క్?

**ఆరు వేల జాబ్స్ వచ్చే చాన్స్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్‌లో నిర్మిస్తున్న పల్సస్‌ఐటీ పార్క్ ప్రాజెక్టుకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్యాంపస్‌కు ఐటీ ఆధారిత సేవలు (ఐటీఈఎస్) ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) హోదాను న్యాయస్థానం సమర్థించింది. దీంతో పల్సస్ గ్రూప్ ఈ ఏఐ హెల్త్‌కేర్ డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌లో రూ. 500 కోట్లు పెట్టుబడులతో విస్తరణ పనులను వేగవంతం చేసింది. 35 ఎకరాల ఈ క్యాంపస్ ద్వారా 6,000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, 30 వేల మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని పల్సస్ సంస్థ సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏఐ నిపుణులు, హెల్త్‌కేర్ డేటా సైంటిస్టుల నియామకాలకు ఈ కేంద్రం వేదిక కానుంది. లీగల్ అడ్డంకులు తొలగిపోవడంతో మియాపూర్ గ్రోత్ కారిడార్ పరిసర ప్రాంతాలలో సాంకేతిక వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఉద్యోగాల కల్పనతో పాటు ఆవిష్కరణలు, పరిశోధనలు, అంతర్జాతీయ సేవల రంగాన్ని ప్రోత్సహించే ఒక బలమైన వ్యవస్థను అభివృద్ధి చేయడానికి వర్సిటీలు, పరిశోధనా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, స్టార్టప్‌లు, టెక్ కంపెనీలతో కలిసి పనిచేస్తామని పల్సస్ తెలిపింది.




# 20వ & 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం

**కొత్తగూడెం ఢ ఇల్లందు ఏరియాలకు సంయుక్తంగా సమావేశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 17, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ఆర్.సి.ఓ. ఏ క్లబ్ నందు మంగళవారంన కొత్తగూడెం ఢ ఇల్లందు ఏరియాలకు సంయుక్తంగా 20వ ఢ 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించడం జరిగినది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, గని ప్రమాదాలలో మరణించిన వారికి మౌనం పాటించారు. రక్షణ గురించి ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా సేఫ్టీ అధికారి ఎం. వెంకటేశ్వర రావు గత 19వ రక్షణ సమావేశ మినిట్స్ పై ఏరియాలో రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు 19వ నేషనల్ సేఫ్టీ కాన్ఫరెన్స్ మినిట్స్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగినది. రక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని జీరో హాం (ప్రమాద రహిత) తో పనిచేయాలని తెలియజేశారు. అనంతరం ఇల్లందు ఏరియా గత 17వ రక్షణ సమావేశ మినిట్స్ పై ఏరియాలో రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగినది. అనంతరం యూనియన్ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ లు, అన్ని గనుల మేనేజర్లు, రక్షణ అధికారులు రక్షణ పై చర్చించారు. అనంతరం డీజిఎంఎస్ అధికారులు, డీడీఎంఎస్ లు మాట్లాడుతూ గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై చర్చించి,



గనుల్లో ప్రమాదాల నియంత్రణకు సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని తెలియజేశారు అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బొగ్గు ఉత్పత్తి రవాణా చేసినందుకు కొత్తగూడెం ఇల్లందు ఏరియా వారిని అభినందించారు, ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా రక్షణను ఇంకా మెరుగుపరచుకొని రక్షణతో కూడిన ఉత్పతి చేయాలని తగు సూచనలు, సలహాలు ఇవ్వటం జరిగింది. కొత్తగూడెం ఢ ఇల్లందు ఏరియాలలోని అన్ని యూనియన్ ప్రతినిధులు, అన్ని గనుల ఏజెంట్లు ప్రాజెక్టు ఆఫీసర్స్, శాఖధిపతులు, మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూపు ఇంజనీర్స్, రక్షణ అధికారులు, పిట్ ఇంజనీర్స్, ఏరియా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు వర్క్ మైన్ ఇన్స్పెక్టర్స్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ప్రతినిధులు, యూనియన్ నాయకులు గనుల యొక్క పనితీరు రక్షణపై తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఢ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు తో పాటు ఐ. సత్యనారాయణ, డీఎంఎస్ (మైనింగ్), హైదరాబాద్ రీజియన్ టి. హరి ప్రసాద్, డీడీఎం ఎస్ (మైనింగ్) ఎస్కే. నాగుల్ మీరా, డీ డి ఎం ఏస్ (ఎలక్ట్రికల్) సుధీర్ కుమార్ బొల్లా, డీ డి ఎం ఏస్ (మెకానికల్) వి. మల్లికార్జున్, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, కొత్తగూడెం ఏ ఎండి. రజాక్, ఐన్ టీ యూ సి వైస్ ప్రెసిడెంట్, కొత్తగూడెం ఏ ఎస్. వి. రమణ మూర్తి, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, కార్పొరేట్ ఎస్. పీతాంబరం, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్రీ ఎస్. సుధాకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ, సత్తుపల్లి (ఎస్పీ ఎల్ ) కోటేశ్వర రావు, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్, సత్తుపల్లి (ఎస్పీ ఎల్ఎండి. నజీర్ అహ్మద్, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, ఇల్లందు కె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్, ఇల్లందు ఎస్. వెంకట చారి, సీఎంపై, కార్పొరేట్రీ ఎం.వి. నరసింహారావు, సీఎం ఓ ఏ, కొత్తగూడెం శివ ప్రసాద్, సీఎం ఓ ఏ, ఇల్లందు కె. సాయి బాబు, జిఎం (సేఫ్టీ) కార్పొరేట్రీ సిహెచ్. శ్రీనివాస్, జిఎం సత్తుపల్లి ఎం. షాలెం రాజు, జిఎం కొత్తగూడెం వీసం కృష్ణయ్య, జిఎం, ఇల్లందు కృష్ణ గోపాల్ తివారీ, జిఎం (సేఫ్టీ), కొత్తగూడెం రీజియన్‌ఆర్. కిరణ్ రాజ్‌కుమార్, సిఎంఓ (సీఎంవో) ఎం. ఉష /జి. సునీల, ఎసిఎంఓ (ఏసీఎంవో), మెయిన్ హాస్పిటల్ (ఎం హెచ్), కొత్తగూడెం (కేజీఎంఎ), అన్ని గనుల వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ కాంట్రాక్ట్ రిప్రజెంటేటివ్స్, అన్ని యూనియన్ ప్రతినిధులు, అన్ని గనుల ఏజెంట్లు మరియు ప్రాజెక్టు ఆఫీసర్స్, శాఖధిపతులు, మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూపు ఇంజనీర్స్, రక్షణ అధికారులు, పిట్ ఇంజనీర్స్, ఏరియా స్టక్షర్ కమిటీ సభ్యులు, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ప్రతినిధులు, యూనియన్ నాయకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పల్స్
epaper.hyderabadpulsenews.in
GENERAL NEWS
గురువారం
18-06-2025




# విజయ్ దేవరకొండ, వెంకటేష్‌లకు లీగల్ నోటీసులు..

## 'టీజీ20 లీగ్' వివాదంలో సినీ, క్రీడా ప్రముఖులు!

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'టీజీ20 లీగ్' చుట్టూ ఇప్పుడు ఊహించని లీగల్ ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఈ లీగ్‌ను ప్రమోట్ చేస్తున్న టాలీవుడ్ స్టార్ హీరోలు వెంకటేష్, విజయ్ దేవరకొండలతో పాటు పలువురు స్టార్ క్రికెటర్లకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (ఁజూా) లీగల్ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు స్పోర్ట్స్ అండ్ సినీ సర్కిల్స్‌లో సంచలనంగా మారింది.

**బీసీసీఐ అనుమతి లేదు - టీసీఏ సంచలన ఆరోపణలు:**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×) నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే హెచ్‌సీఏ ఈ టీజీ20 లీగ్‌ను అక్రమంగా నిర్వహిస్తోందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ స్పష్టం చేసింది. బోర్డు పర్మిషన్ లేని లీగ్‌ను సెలబ్రిటీలు ప్రమోట్ చేయడం చట్టప్రకారం తప్పని వేలెత్తి చూపింది. నిబంధనలకు విరుద్ధంగా ఈ లీగ్ పేరు వాడుకుంటూ కార్పొరేట్ కంపెనీలతో హెచ్‌సీఏ రూ. వందల కోట్ల బిజినెస్ చేస్తోందని టీసీఏ మండిపడింది. ఇది కేవలం యువ క్రికెటర్లను, స్పాన్సర్లను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించింది.ఈ అక్రమ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా, ప్రమోటర్లుగా వ్యవహరిస్తున్నారంటూ టీసీఏ కింది ప్రముఖులకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపింది:

సినీ ప్రముఖులు: రౌడీ హీరో విజయ్ దేవరకొండ, విక్టరీ వెంకటేష్.క్రికెట్ స్టార్స్: టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్, యువ సెన్సేషన్ తిలక్ వర్మ, మాజీ క్రికెటర్ అంబటి రాయుడు.బీసీసీఐ రూల్స్ బ్రేక్ చేస్తూ సాగుతున్న ఈ లీగ్ ప్రమోషన్లపై సదరు ప్రముఖులు వెంటనే పునరాలోచన చేయాలని.. లేనిపక్షంలో చట్టపరంగా కఠినమైన న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసుల్లో టీసీఏ గట్టిగా హెచ్చరించింది.






# ట్రెడ్‌మిల్‌ను రివర్స్‌లో వాడేస్తున్న బుట్టబొమ్మ!


నటి పూజా హెగ్డే తన ఫిట్‌నెస్‌కు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కెమెరా ముందు పర్ఫెక్ట్ ఫిజిక్‌తో కనిపించడానికి ఆమె కఠినమైన నియమాలు పాటిస్తుంటుంది. జిమ్‌లో చెమటలు చిందించడం నుంచి ఆహార నియమాల వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో, తరచూ తన వర్కౌట్ వీడియోలతో అభిమానులను, ఫిట్‌నెస్ ప్రియులను ఉత్తేజపరుస్తుంటుంది. తాజాగా మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో మరో వర్కౌట్ వీడియోను పంచుకుంది.ఈ వీడియోలో పూజా హెగ్డే ట్రెడ్‌మిల్‌పై స్టైల్‌గా వెనక్కి నడుస్తూ కనిపించింది. తన ఫోన్‌తో తానే వీడియో తీసుకుంటూ ఈ విన్యాసం చేసింది. ఆరెంజ్ కలర్ క్రాప్ టాప్, దానికి సరిపోయే షార్ట్స్ ధరించి వర్కౌట్ సెషన్‌లో పాల్గొంది. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన పోస్టులు చేయడం పూజాకు కొత్తేమీ కాదు. తరచుగా తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి సంబంధించిన విషయాలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంటుంది.ఇక సినిమాల విషయానికొస్తే, పూజా హెగ్డే ఇటీవల "హై జవానీ తో ఇష్క్ హోనా హై" అనే రొమాంటిక్ కామెడీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్‌లతో కలిసి ఆమె నటించింది. జూన్ 5న విడుదలైన ఈ సినిమాలో మౌనీ రాయ్, చుంకీ పాండే, మనీష్ పాల్, జిమ్మీ షెర్గిల్ వంటి ప్రముఖ నటులు కూడా ఉన్నారు. టిప్స్ బ్యానర్‌పై రమేష్ తౌరానీ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# మెగాస్టార్ చిరంజీవి వ్యక్తిత్వంపై జగపతిబాబు ప్రశంసలు

టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవి గురించి పంచుకున్న కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. జగపతిబాబు హీరోగా పరిచయమైన తొలి సినిమా 'సింహ స్వప్నం'. ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టాల్సిందిగా కోరడానికి జగపతిబాబు, ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారట. అప్పట్లో చిరంజీవి గారు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా, స్టార్‌డమ్‌లో పీక్స్‌లో ఉన్నప్పటికీ.. వీరిని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారట. అంతేకాదు, జగపతిబాబును చూడగానే "చాలా అందంగా ఉన్నావు" అని మెచ్చుకుని, అడగడమే ఆలస్యం వెంటనే వచ్చి సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు.క ఆ సంఘటన జరిగిన దాదాపు 35 సంవత్సరాల తర్వాత, 'పెద్ది' సినిమాలో జగపతిబాబు పోషించిన పాత్రను చూసి చిరంజీవి మళ్లీ అదే స్థాయిలో ఫోన్ చేసి మరీ ప్రశంసించారట. చిరంజీవిలోని ఆ గొప్ప గుణాన్ని జగపతిబాబు ఈ ఇంటర్వ్యూలో ఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఒకప్పుడు హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన జగపతిబాబు, ప్రస్తుతం వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతున్నారు.



# sports



# వివాదంలో మెస్సీ..

### ఫౌల్ చేసినా కార్డు చూపని రిఫరీ..

అర్జెంటీనా, అల్జీరియా మధ్య జరిగిన మ్యాచ్ పెద్ద వివాదానికి దారితీసింది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ చేసిన కఠిన ఫౌల్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మ్యాచ్‌లో అల్జీరియా ప్లేయర్‌పై మెస్సీ వెనుక నుంచి స్టడ్స్-అప్ ఛాలెంజ్ చేశాడు. దీంతో ఆ ప్లేయర్ నొప్పితో నేలపై పడిపోయాడు. ఇది కచ్చితంగా రెడ్ కార్డు ఇవ్వాల్సిన ఫౌల్ అని అభిమానులు మండిపడుతున్నారు. వీఏఆర్ ఈ ఘటనను రివ్యూ చేసినప్పటికీ, మ్యాచ్ రిఫరీ సైమన్ మార్సినియాక్ మెస్సీకి ఎల్లో కార్డు కూడా ఇవ్వకుండా వదిలేశారు. అయితే రిఫరీ నిర్ణయంపై సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేగుతోంది. 'మెస్సీ అయితే రూల్స్ మారిపోతాయా?' అంటూ ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో లియోనల్ మెస్సీ చరిత్ర సృష్టించాడు. హ్యాట్రిక్ గోల్స్ చేసి 3-0తో అల్జీరియాపై ఘనవిజయం సాధించాడు.మరోవైపు ఈ మ్యాచ్‌తో మెస్సీ ఖాతాలో మరో రికార్డు పడింది. వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక సంఖ్యలో గోల్స్ చేసిన జర్మనీ ప్లేయర్ మిరోస్లేవ్ క్లోస్‌తో సమానంగా నిలిచాడు. జర్మనీ ఫుట్‌బాలర్ క్లోస్ వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధికంగా 16 గోల్స్ చేసి లీడింగ్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే ఇప్పుడు అతని రికార్డును మెస్సీ సమం చేశాడు.



# అఫ్గాన్‌పై సూపర్ సెంచరీ..ఇషాన్ కిషన్ అరుదైన ఘనత

లఖ్‌నవూ వేదికగా భారత్-అఫ్గానిస్థాన్ జట్లు రెండో వన్డేలో తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కి దిగిన టీమిండియా ప్లేయర్లు.. విధ్వంసం సృష్టిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. 79 బంతుల్లో ఏకంగా 125 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. అతడికి ఇది రెండో వన్డే సెంచరీ కావడం విశేషం. ఈ క్రమంలో ఇషాన్ తన వన్డే కెరీర్‌లో 1000 పరుగుల మైలురాయిని అందుకున్నాడు.ఇషాన్ కిషన్ ఈ వెయ్యి పరుగుల మైలురాయిని కేవలం 26 ఇన్నింగ్స్‌లోనే చేరుకున్నాడు. దీంతో భారత్ తరఫున అత్యంత వేగంగా వెయ్యి వన్డే పరుగులు పూర్తి చేసిన ప్లేయర్ల జాబితాలో అతడు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(19 ఇన్నింగ్స్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్(24 ఇన్నింగ్స్) రెండో స్థానంలో, నవ్‌జ్యోత్ సింగ్, శ్రేయస్ అయ్యర్(25 ఇన్నింగ్స్) మూడో స్థానంలో ఉన్నారు.

**మరో రికార్డు..**

71 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్న ఇషాన్ కిషన్.. తన ఖాతాలో మరో రికార్డు కూడా వేసుకున్నాడు. వన్డేల్లో అఫ్గాన్‌పై ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో భారత ప్లేయర్‌గా ఇషాన్ నిలిచాడు. అతడి కంటే ముందు స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఉన్నాడు. 2023లో 63 బంతుల్లోనే రోహిత్ శర్మ శతక్కొట్టాడు. కాగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 77 బంతుల్లో సెంచరీ చేసి.. ఈ జాబితాలో మూడో భారత ప్లేయర్‌గా నిలిచాడు.




# ఫిఫా ప్రపంచ కప్...ఆస్ట్రియా చారిత్రక విజయం

ఫిఫా ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రియా జట్టు చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. జోర్డాన్ జట్టుపై 3-1 తేడాతో గెలిచింది. దీంతో 36 ఏళ్ల తర్వాత ప్రపంచ కప్‌లో గెలుపు రుచి చూసింది. ఆఖరిసారిగా 1990 ప్రపంచ కప్‌లో ఆస్ట్రియా.. యునైటెడ్ స్టేట్స్‌పై విజయాన్ని అందుకుంది. కాగా ఆరంభం నుంచి ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో.. ఆస్ట్రియా జట్టు జోర్డాన్‌పై పై చేయి సాధించింది.ఈ మ్యాచ్ 20వ నిమిషంలో ఆస్ట్రియా ఆధిక్యంలోకి వెళ్లింది. అద్భుతమైన జట్టు సమన్వయంతో సాగిన గేమ్‌ను రొమానో ష్మిడ్ గోల్‌గా మలిచాడు. జేవర్ ష్లాగర్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న అతడు బాక్స్ అంచు నుంచి కొట్టిన షాట్ నేరుగా గోల్‌పోస్ట్ ఎగువ మూలలోకి దూసుకెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో జోర్డాన్ గట్టిగా పోరాడింది. 50వ నిమిషంలో అలీ ఓల్వాన్ వేగవంతమైన కౌంటర్ అటాక్‌ను గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. దీంతో మ్యాచ్ మరింత రసవత్తరంగా మారింది. 76వ నిమిషంలో మ్యాచ్ మలుపు తిరిగింది. కార్నర్ కిక్ సందర్భంగా వచ్చిన బంతిని క్లియర్ చేసే ప్రయత్నంలో జోర్డాన్ డిఫెండర్ యజాన్ అరబ్ పొరపాటున తన గోల్‌పోస్ట్‌లోకే మళ్లించాడు. దీంతో ఆస్ట్రియా 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. అంతకుముందు 90వ నిమిషంలో సీనియర్ స్ట్రైకర్ మార్కో అర్నాటోవిక్ చేసిన గోల్‌ను వీడియో అసిస్టెంట్ రిఫరీ సమీక్ష అనంతరం హ్యాండ్‌బాల్ కారణంగా రద్దు చేశారు. అయితే అదనపు సమయంలో అతడు పెనాల్టీని గోల్‌గా మలిచి ఆస్ట్రియా విజయాన్ని ఖాయం చేశాడు.

**అంత సులభం కాదు: ఆస్ట్రియా కోచ్**

మ్యాచ్ అనంతరం ఆస్ట్రియా కోచ్ రాల్ఫ్ రాంగ్నిక్ మాట్లాడారు. 'ఇది అత్యంత కఠినమైన పోరు. జోర్డాన్ అద్భుతంగా పోరాడింది. మేం గెలిచాం కానీ ఈ విజయం అంత సులభంగా రాలేదు' అని తెలిపాడు. ఆస్ట్రియా తన తొలి మ్యాచ్‌లో మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుతో జూన్ 22న తలపడనుంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.